## క్లుప్తంగా

### వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం


వైఎస్సార్ విగ్రహం వద్ద అపరంజిరాజు, నాయకులు

నాగలాపురం: మండల కేంద్రంలోని టవర్ క్లాక్ కూడలి వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో భాగంగా విగ్రహానికి ముసుగు వేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఎత్తి వేసిన నేపథ్యంలో విగ్రహానికి ఉన్న ముసుగును తీసి వేసి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ చిన్నదొరై సుధా, ఉప సర్పంచ్ సునీత, నాయకులు శ్యామ్, ఉదయ్, దేశప్పన్, చిరంజీవి, ధనరాజ్, దేశన్, హరిబాబు, అమర తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలింతలు, గర్భిణులకు కార్యకర్త ప్రమీలమ్మ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఇచ్చే మందులను క్రమంతప్పకుండా వాడాలని తెలిపారు.

### యువత, వృద్ధులకు సన్మానం


మాట్లాడుతున్న ఆదిమూలం

నారాయణవనం: నిరుద్యోగ యువతను, వృద్ధులను శుక్రవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సన్మానించారు. స్థానిక హరి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చేసిన ఐదు సంతకాలతో సంక్షేమం ప్రారంభమైందన్నారు. నిరుద్యోగ యువతకు డీఎస్సీ, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి, వృద్ధులకు, దివ్యాంగులకు నాలుగువేల పింఛన్ పెంపు హర్షణీయమని తెలిపారు. ఈ సందర్భంగా యువతకు, వృద్ధులకు స్వీట్లు, పండ్లను ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పంపిణీ చేశారు.

### టీడీపీ నాయకుల సంబరాలు

బుచ్చినాయుడుకండ్రిగ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐదు ఫైళ్లపై సంతకాలు చేయడంపై శుక్రవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు థ్యాంక్యూ సీఎం అంటూ ప్లకార్డులు చేతబట్టి సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, నాయకులు సముద్రాల సుధాకర్‌నాయుడు, మధునాయుడు, వెంకటచలం, సురేంద్ర, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మునిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం


క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి: ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని ఆపి, వస్త్ర సంచులను వినియోగిద్దామని మార్గదర్శి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం మార్కెట్ యార్డులో సంతలో ప్రజలకు సంస్థ తరపున వస్త్ర సంచులను పంపిణీ చేశారు. వస్త్ర సంచుల వినియోగం, ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించారు. ఇకపై ప్రతి శుక్రవారం వస్త్ర సంచులను పంపిణీ చేసి ప్లాస్టిక్ సంచుల నిషేధంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రుద్రశేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, అక్బర్, పాండు, దిలీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని పలు గ్రామాలకు చెందిన వారు కోరారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆధార్ కేంద్రం లేక పోవడంతో తప్పులను సరి చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇందుకోసం శ్రీకాళహస్తికి వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. సమయం, డబ్బు వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. అధికారులు స్పందించి ఆధార్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# తెలుసుకో.. జాగ్రత్తగా మసలుకో..!

గ్యాస్ సిలిండర్‌లు వినియోగించే ముందు వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆయిల్ కంపెనీలు సిలిండర్‌లను పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం గ్యాస్ నింపి వినియోగదారులకు సరఫరా చేస్తాయి. అయితే వీటికి కాలపరిమితి ఉంటుంది. సిలిండర్ సరఫరా చేసిన ప్రతి పర్యాయం వినియోగదారులు వాటి గడువు తేదీని పరిశీలించాలి. కాలపరిమితి ముగిసిన సిలిండర్ వినియోగిస్తే లీకేజీలతో ప్రమాదాలు పొంచి ఉంటాయి

- గడువు దాటితే ముప్పు తప్పదు
- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గడువు తేదీని పరిశీలించి తీసుకోవాలి
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి


పిచ్చాటూరు గ్యాస్ గోడౌన్‌లో సిలిండర్లు

పిచ్చాటూరు: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో.. సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాలపరిమితి ఉంటుందని, దాన్ని వినియోగదారులు గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ, కోడ్ విధానంలో మెటల్ ప్లేటుపై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుకున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించుకోవాలి.


గోడౌన్ నుంచి డెలివరీకి..

**ఇలా గుర్తించాలి..**
సిలిండర్ మెటల్ ప్లేటుపై ఏ–24, బి–24 అని ఉంటే ఆ సిలిండర్ 2024 మార్చి– జూన్‌కి గడువు ముగుస్తుందని అర్థం. 24 అంటే 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. 'ఏ'అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, 'బీ' అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, 'సీ' అక్షరం జులై నుంచి సెప్టెంబర్ వరకు, 'డి' అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది.

**ఎట్టిపరిస్థితుల్లో తీసుకోవద్దు..**
సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేటుపై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని పరిశీలించాలి. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.

**సిలిండర్‌కు పదేళ్ల గడువు..**
సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో.. సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తర్వాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

**వినియోగదారుని హక్కులు..**
- వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబసభ్యుల పేరిట ఆ కనెక్షన్‌ను మార్పు చేసుకోవచ్చు.
- కొత్త కనెక్షన్ కోసం నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు.
- కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. డీలర్ వద్దనే కొనుగోలు చేయాలనే నిబంధన ఏమీ లేదు.
- గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివెరీ చేయాలి.

# నయనానందకరంగా ఊంజల్ సేవ


ఊంజల్ సేవలో శ్రీపద్మావతీ అమ్మవారు

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీపద్మావతీ అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి పూజలు చేశారు. తదుపరి అంతర ప్రాకారంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి ఊంజల్ మండపంలోని ఊయలపై కొలువుదీర్చారు. వేద నాద కచేరీల నడుమ అమ్మవారు ఊయలలో సేద తీరుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# రక్తదానం మరొకరికి ప్రాణం దానం


ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న దాతలు






శ్రీకాళహస్తి: రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడాలని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఈ శిబిరంలో బెస్త తరుణ్ 70మంది మిత్ర బృందంతో కలిసి రక్తదానం చేశారు. రక్తదానంతో యువతను ప్రోత్సహిస్తున్న తరుణ్‌ను ఆస్పత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు. అదే విధంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కూడా ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 20మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, రెడ్డిపల్లి సురేష్,నాగరాజు, అన్వర్‌బాషా, రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అర్జున తపస్సుమాను


అమ్మవారి గ్రామోత్సవం

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలోని శ్రీరేణుక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మాతమ్మ కొలుపు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అర్జున తపస్సుమాను ఉత్సవం వైభవంగా జరిగింది. అర్జున వేషధారి తప్పస్సుమాను ఎక్కి నిమ్మపండ్లను పైనుంచి విసిరారు. వాటిని అందుకునేందుకు జనం ఉత్సాహం చూపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గౌరీదేవి ముగ్గును వేసి పూజలు నిర్వహించారు. గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీసిటీ ఎస్‌ఐ గౌస్ పీర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.


తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

### బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై కార్మికశాఖ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. వస్త్రదుకాణాలు, బేకరీలు, హోటల్స్, జనరల్ స్టోర్స్ వంటి వాటిలో తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు రంగనాథ్, శ్రీమన్నారాయణ, హేమాచారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో కూడిన నాణ్యమైన విద్యా బోధన లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ కె.రవి కోరారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ స్కూల్‌ను ఎంఈఓ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్లపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నోటు పుస్తకాలు, టెక్స్ట్ బుక్స్, బ్యాగు, బూట్లు, సాక్స్‌లు, బెల్టు, మూడు జతల యూనిఫాం ఇస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు డిజిటల్ విద్యా బోధన చేస్తున్నట్లు వివరించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.హెచ్‌ఎం పి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వేలాయుధం, భానుజ తదితరులు పాల్గొన్నారు.

### చిల్లకూరు సంతలో పొట్టేళ్లకు గిరాకీ

చిల్లకూరు : చిల్లకూరులో శుక్రవారం గొర్రెల సంతలో పొట్టేళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. ముఖ్యంగా బక్రీద్‌ను పురస్కరించుకుని వైఎస్సార్ కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి రైతులు తమ గొర్రెలు, పొట్టేళ్లను సంతకు తీసుకుని వచ్చారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పెద్దసంఖ్యలో మార్కెట్‌కు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో జోరుగా క్రయవిక్రయాలు సాగాయి. సుమారు 30 వేల వరకు గొర్రెలు, పొట్టేళ్ళు, మేకలు అమ్ముడైనట్లు మార్కెట్ కమిటీ అధికారులు వెల్లడించారు. ఒక పొట్టేలు మాములు రోజుల్లో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని, అయితే ఇప్పుడు రూ.15వేల నుంచి రూ.30వేల వరకు పలికినట్లు తెలిపారు. తాడేపల్లి గూడెం నుంచి వచ్చిన వ్యాపారులే దాదాపు 100 నుంచి 150 పొట్టేళ్లు కొనుగోలు చేయడంతో ఉదయం 11 గంటలకే సంత దాదాపుగా ఖాళీ అయిపోయిందని వివరించారు.

# పలు అభివృద్ధి పనులకు ఆమోదం


మాట్లాడుతున్న కార్యదర్శి నాగరత్నమ్మ

నాగలాపురం: పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ చొన్నదొరై సుధా ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ సమావేశం నిర్వహించారు. కార్యదర్శి నాగరత్నమ్మ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధుల ద్వారా పంచాయతీ పరిధిలోని సాయినగర్, బీసీకాలనీ, వినోభానగర్ గ్రామాల్లో కొత్త బోరు పైపు లైన్లు, బ్రాహ్మణ వీధిలో డ్రైనేజీ పనులు, వడ్లకుప్పం గ్రామంలో సీసీరోడ్డు, గ్రావెల్ రోడ్డు, పనులు ప్రారంభించేందుకు నిధులు కేటాయించి ఆమోదించినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ సునీత, వార్డు మెంబర్లు ఉదయ్, సునీల్, చిరంజీవి,వెంకటేశులు, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కండలేరులో 6.467 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.467టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# సిద్ధిలేశ్వర కోన వద్ద హెచ్చరిక బోర్డులు



రాపూరు : రాపూరు–చిట్వేలి మార్గంలో వెలుగోండ అటవీ ప్రాంతంలోని సిద్ధిలేశ్వర కోన వద్ద పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కోన జలపాతంలో మునగవద్దని, అక్కడి నీటి గుంతలో గుండాలు, పాకుడు పట్టిన పెద్ద రాళ్లు ప్రమాదకరంగా ఉన్నట్లు బోర్డుల్లో పేర్కొన్నారు. గత పదేళ్లలో ఈ జలపాతంలో మునిగి సుమారు 18 మంది యువకులు మృత్యువాత పడ్డారని బోర్డులో ప్రకటించారు. సరదా కోసం ప్రాణాల మీదకు తెచ్చుకుని కుటుంబీకులకు విషాదం మిగల్చవద్దని పోలీసులు, పంగిలి పంచాయతీ అధికారులు సూచించారు.

### ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఏపీఓ భానుప్రియ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెంలో ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీడీ భానుప్రియ పరిశీలించారు. కూలీల హాజరును పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.272 కూలి వస్తుందని, రోజుకు 5 వేల మంది కూలీలు పనిచేస్తున్నారని, టార్గెట్ ప్రకారం కూలీల సంఖ్య తగ్గకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వరయ్యను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటల పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

# మలేరియా నివారణ అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాపూరు : మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని జోరేపల్లెలో వేపినాపి ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సూర్యధర్మేంద్ర మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందితే మలేరియా జ్వరాల బారిన పడే ప్రమాదముందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మురుగు నీరు తొలగించుకోవాలని సూచించారు. దోమ తెరలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు.

# మున్సిపల్ ఆస్తులను పరిరక్షిస్తాం




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేసుధీర్‌రెడ్డి, హాజరైన అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రక్షాళన ప్రారంభించి ఆక్రమణలు తొలగిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో పురపాలక, రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటైజేషన్, పన్నులు, సీసీరోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ, టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ పర్మిషన్లు, ఖాళీస్థలాల పన్నులు, మహిళా సంఘాలు తదితరాల అంశాలపై సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్రమిత స్థలాల్లో నిర్మించిన కట్టడాలను తొలగిస్తామని అన్నారు. మునిస్పల్ ఆస్తులను పరిరక్షించి బోర్డులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మున్సిపల్ కాంప్లెక్స్ గదుల టెండర్లను రద్దు చేసి మళ్లీ కొత్తగా పిలుస్తామన్నారు. నాలుగు మాడవీధుల్లో ఎవరూ బ్యానర్ల కట్టడంపై నిషేధం విధించాలని మున్సిపల్ అలధికారులకు సూచించారు. స్వాగత ఆర్చీ వద్ద నుంచి మైక్‌లు ఏర్పాటు చేసి శివనామస్మరణ మార్మోగేలా చేయనున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తి ఆలయంలో దేవస్థానం, పోలీసుశాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్‌రూమ్ ద్వారా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు.

### గోవును రక్షించిన యువకులు


కాలువలో నుంచి వెలికి తీస్తున్న యువకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పురుషుల డిగ్రీ కళాశాల వద్ద శ్రీకాళహస్తి–పిచ్చాటూరు మార్గంలో ఓ గోవు ప్రమాదవశాత్తు మురుగునీటి కాలువలో పడిపోయింది. అందులో నుంచి లేవలేక అవసోపాలు పడింది. అటుగా వెళుతున్న యువకులు స్పందించి కర్రల సాయంతో ఆవును రక్షించారు. యువకుల మానవత్వాన్ని స్థానికులు అభినందించారు.

### ఎమ్మెల్యేకు సన్మానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన బొజ్జల సుధీర్‌రెడ్డిని శుక్రవారం నియోజకవర్గ మీసేవ ఆపరేటర్లు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, రేణిగుంట మండలాల మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

### తెలుగు మీడియంను తప్పనిసరి చేయాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు తెలుగు మీడియంను తప్పనిసరి చేయాలని, అలాగే 6నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో బోధన చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాంబిరెడ్డి కోరారు. తిరుపతిలోని ఆపస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, 117 జీఓను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# వైన్‌షాప్‌ల సిబ్బంది ఆందోళన


నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

నాయుడుపేటటౌన్ : పట్టనంలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద శుక్రవారం వైన్ షాపుల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కొత్తగా మద్యం పాలసీ తీసుకువస్తుందని ప్రచారం జరుగుతోందన్నారు. ఇప్పుడు నిర్వహిస్తున్న మద్యం దుకాణాలను తొలగించి, వాటి స్థానంలో పాత విధానంలో షాపులు పెట్టనున్నట్లు ప్రచారం సాగుతోందని తెలిపారు. ఒక వేళ ఈ వైన్‌షాపులను తొలగిస్తే తమ కుటుంబాలు వీధిన పడతాయని, తమను సర్కారే ఆదుకోవాలని కోరారు. ఒక్క ఓజిలి డిపో పరిధిలోని దాదాపు 580 మంది పనిచేస్తున్నారని, ప్రభుత్వం కనికరించకుంటే తాము జీవనోపాధి కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి వినతిపత్రం అందించినట్లు ఔట్ సోర్సింగ్ సిబ్బంది తెలిపారు.